క్లుప్తంగా

నివేశన స్థలాలు పంపిణీ చేయాలి



తిరువూరు: కూటమి భాగస్వామ్య పార్టీలు ఇచ్చిన నివేశన స్థలాల హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. తిరువూరులో పేదలకు నివేశన స్థలాల పంపిణీ కోరుతూ పలువురి నుంచి శుక్రవారం అర్జీలు సేకరించి ఆయన మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

సైకిళ్లు అందజేత

తిరువూరు: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని నలుగురు విద్యార్థినులకు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి మేనేజరు రవికుమార్ శుక్రవారం సైకిళ్లు అందజేశారు. బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని బాలికలకు అందజేశామని మేనేజరు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం పీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

ఇబ్రహీంపట్నం: రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని ఫెర్రీలోని సచివాలయం సమీపంలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు, వంట గ్యాస్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. మహిళలు, యువతలో దేశభక్తి పెంపొందించేందుకు పోటీలు ఏర్పాటు చేశామని కార్యక్రమ నిర్వాహకులు ఎస్.సత్యనారాయణ తెలిపారు. విజేతలకు ఈనెల 26న మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తామన్నారు. పలువురు మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ

తిరువూరు: అనారోగ్యంతో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మొగిలిపువ్వు వేలాద్రి (80) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం దానం చేశారు. తిరువూరు లయన్స్ క్లబ్ సహకారంతో విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నిపుణులు విచ్చేసి ఆయన కార్నియాలను సేకరించారు.

కంప్యూటర్ల బహూకరణ



నూజివీడు: పట్టణంలోని ఐడీబీఐ నూజివీడు శాఖ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మండలంలోని పోతురెడ్డిపల్లిలోని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు నాలుగు కంప్యూటర్లను శనివారం అందజేశారు. సర్పంచి తగరం సుజాత పాల్గొన్నారు.

చెరువులో చేపలు మృతి

విస్సన్నపేట: స్థానిక కోనేరు చెరువులో చేపలు శుక్రవారం చనిపోయాయి. చేపల పెంపకందారుడు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ ఈఓ హరికృష్ణ కుమార్ చెరువులో మృతి చెందిన చేపలను పరిశీలించారు. చనిపోయిన చేపలను, నీటిని ల్యాబ్‌లో పరీక్షలకు పంపారు.

సమస్యలు పరిష్కరించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని బీజేపీ పట్టణ నూతన అధ్యక్షురాలు తమ్మినేని మాధురి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమ్యకీర్తన ను శుక్రవారం ఆమె మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

తిరువూరు: ఇటీవల జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందుకున్న తిరువూరులోని పలువురు ఉపాధ్యాయినులను జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో శుక్రవారం సన్మానించారు. స్థానిక శ్రీనిధి స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయినులు శ్రీలత, శిరీష, పద్మావతి, కృష్ణవేణి, విజయ, వాణిలను సత్కరించారు.

ఎల్‌హెచ్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

మైలవరం: కృష్ణా యూనివర్సిటీ డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ బీఏలో 90 శాతం, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 95 శాతం, బీఎస్సీలో 92 శాతం ఉత్తీర్ణుల య్యారని చెప్పారు. కళాశాలలో మొత్తం 93 మంది విద్యార్థులకు గాను 84 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

శిక్షణ తరగతుల పరిశీలన

ఆగిరిపల్లి: ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ఎంఈఓ కొవ్వలి ఆనంద్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. తోటపల్లి హీల్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ అంశంపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదో రోజు శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఏఎంఓ రెడ్డి రామారావు, కేఆర్పీలు హరికృష్ణ, ఎస్.శ్రీరామ్, డీఆర్పీలు పాల్గొన్నారు.

కుక్కలు, కోతులతో బెంబేలు

- గుంపులు గుంపులుగా తిరుగుతూ స్వైర విహారం
- పిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడి
- బయటకు రావాలంటే గ్రామస్తుల భయాందోళన



ఇళ్ల వెంట తిరుగుతున్న కోతులు



గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

నూజివీడు: నియోజకవర్గ వ్యాప్తంగా కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. వీధుల్లో ఎక్కడ చూసినా కోతులు, కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులపై కోతులు దాడి చేస్తున్నాయి. కుక్కలు, కోతుల బెడదపై మున్సిపల్ సమావేశాల్లోనూ, మండల పరిషత్ సమావేశాల్లోనూ ప్రజాప్రతినిధులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా, వారిని నిలదీసినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. దీంతో ప్రజాప్రతినిధులు కూడా ఈ సమస్యపై మాట్లాడటం మానివేశారు. సమస్యను అలాగే వదిలివేయడంతో మరింత జటిలంగా మారింది. ప్రజలు భయాందోళన వ్యక్తంచేస్తున్నారు.

కోతుల స్వైర విహారం

కోతి చేష్టలతో ప్రజలు విసిగిపోయి ఏమి చేయలేని స్థితిలో అష్టకష్టాలు పడుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇళ్ల తలుపులు తీసి ఉంటే ఇళ్లల్లోకి జొరబడి కూరగాయలు, పండ్లు, డబ్బాలు తదితర వాటిని బయటకు తీసుకెళ్లి ఆగమాగం చేస్తున్నాయి. తోలడానికి ప్రయత్నిస్తే దాడి చేస్తున్నాయి. అలాగే డిష్ వైర్లు, కేబుల్ టీవీ వైర్లు, నెట్ వైర్లను పట్టుకొని వేలాడుతూ తెంపేస్తున్నాయి. పట్టణాల్లో పార్కుల్లో తిష్ట వేసి వాకింగ్ చేసే వారిపై దాడి చేస్తూ వారిని భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఉద్యాన తోటల్లో సైతం కోతుల బెడదతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మామిడి తోటల్లో కోతుల బెడద లేకుండా ఉండేందుకు కాపలాదారులను ఏర్పాటు చేసి తోటల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. సంపన్న వర్గాల వారు కోతుల బెడద లేకుండా ఉండేందుకు తమ ఇళ్ల చుట్టూ కరెంట్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు.

గ్రామ సింహాలతో హడలిపోతున్న ప్రజలు

కోతులకు తోడు గ్రామాలు, పట్టణాలు అనే భేదం లేకుండా కుక్కల బెడద సైతం ప్రజలను వేధిస్తోంది. వీటి సంతతి రోజురోజుకూ ఎక్కువైపోయి రోడ్డుపై ఒంటరిగా వెళ్లాలంటే భయపడేలా గుంపులుగా తిరుగుతున్నాయి. పాఠశాలలకు వెళ్లేటప్పుడు విద్యార్థులను, ఒంటరిగా వెళ్లే వారిని, ద్విచక్ర వాహనదారుల వెంటబడి హడలెత్తిస్తున్నాయి. కుక్కల సంఖ్య పెరిగిపోయి వీటికి సరిపడా ఆహారం దొరకక బక్క చిక్కి పిచ్చి కుక్కలుగా మారి ప్రజలను కరుస్తున్నాయి. గత నెలలో ముసునూరులో పిచ్చికుక్క 13 మందిపై దాడి చేసి కరిచింది. రహదారులపై ఉండి ఎవరైనా రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్లే వారిని వెంబడిస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం



పట్టణంలో కుక్కల గుంపులతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. ద్విచక్ర వాహనం వేసుకొని వస్తుంటే బండి వెంటపడుతున్నాయి. ఎక్కడ కరుస్తాయోనని మరింత వేగంగా వెళ్లాల్సి వస్తోంది. హఠాత్తుగా మీదకు వస్తుండటంతో కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– షేక్ మస్తాన్‌వలీ, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

ఇంట్లోకి చొరబడుతున్నాయి



తలుపులు తెరిచి ఉంచి ఇంట్లో పనులు చేసుకుంటుంటే చాలు లోపలికి చొరబడుతున్నాయి. డబ్బాలతో పాటు, కూరగాయలు, పండ్లు ఎత్తుకెళ్లి ఆగమాగం చేస్తున్నాయి. తోలేందుకు ప్రయత్నిస్తే మహిళలు, వృద్ధులు, పిల్లలపై దాడి చేస్తున్నాయి. కోతుల బెడదను తొలగించాలి.

– బేరారామ్, నూజివీడు

రమణక్కపేటలో సబ్ కలెక్టర్ పర్యటన

ముసునూరు: కుమ్మరి బజారులో రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. రమణక్కపేటలోని కుమ్మరి బజారులో ప్రతిపాదిత రహదారి ప్రాంతంలో శుక్రవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కుమ్మరి బజారులో ప్రతిపాదిత రహదారి నిర్మించి, దానికి ఇరువైపులా పక్కా డ్రెయినేజీలను నిర్మించే విధంగా సుమారు 12 సెంట్ల స్థల సేకరణ వివరాలను, స్కెచ్‌ను మండల సర్వేయర్ సురేష్ సబ్ కలెక్టర్‌కు వివరించారు. తక్షణమే రహదారి నిర్మాణ ప్రతిపాదనలను డీఎల్‌పీవో, డీపీవోకు పంపి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జనన, మరణ సమాచారం ఇవ్వాలి

తిరువూరు: తిరువూరు పట్టణ పరిధిలో జనన, మరణాల సమాచారాన్ని మూడు రోజుల్లోగా తమ కార్యాలయానికి తెలియజేయాలని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టరు పురపాలక కమిషనర్లకు నిర్వహించిన సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు జనన, మరణ సమాచారాన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు తప్పక తెలియజేయాలని కోరారు. జనన సమాచారాన్ని బిడ్డ డిశ్చార్జి అయ్యేలోపు నగర పంచాయతీకి అందజేయాలని ఆస్పత్రుల నిర్వాహకులను కోరారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో ఇబ్బందులుంటే తమకు తెలియజేయవచ్చన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గత ఏడాది పదో తరగతిలో 577/600 మార్కులు సాధించిన జెడ్పీ బాలికోన్నత పాఠశాల బాలికలు ఎస్కే షఫీనా, ఉషారాణికి డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం నగదు పురస్కారం అందజేశారు. ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున నగదు, సర్టిఫికెట్లు, మెడల్, పుస్తకాలను డాక్టర్ మామిడి సీతారామారావు, డాక్టర్ రత్నమోహనరావు అందజేశారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



మానవహారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

మైలవరం: విద్యతోనే బాలికల ప్రగతి సాధ్యమని ఐసీసీ ప్రిసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ పి. శోభారాణి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సహేలీ క్లబ్ మెంటార్ డాక్టర్ కె.రాణీరుద్రమ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, కళాశాల కో ఫౌండర్, హనరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులకు ఆర్థిక సాయం అందజేశారు.

- **ఆగిరిపల్లి:** బాలికల అభ్యున్నతికి అందరూ సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.
- **తిరువూరు:** బాలికలు సమాజంలో ఎదురయ్యే సమస్యలను దీటుగా ఎదుర్కొని ఉన్నత స్థాయికి ఎదగాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. గంగాధర్ అన్నారు. ఎ. కొండూరు మండలం కంభంపాడు వికాస్ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కిశోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- **తిరువూరు:** గంపలగూడెం మండలం పెనుగొలను షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికలకు రాజ్యాంగ పరమైన హక్కులపై సేవా కమిటీ అధ్యక్షుడు వూటుకూరు నారాయణరావు అవగాహన కల్పించారు.


- **తిరువూరు:** డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రూపొందించిన పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను తిరువూరు ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం డీవైఈఓ సాంబశివరావు ఆవిష్కరించారు.

మద్యం మత్తులో విద్యార్థులపై దాడి

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): మద్యం మత్తులో నలుగురు యువకులు పదో తరగతి విద్యార్థులపై దాడి చేసిన ఘటన కిలేశపురంలో గురువారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన కాండ్రు కార్తీక్, మంగళపూడి అజయ్, రావినూతల ఇవాన్, కాటూరు కార్తీక్ పదో తరగతి చదువుతూ గురువారం రాత్రి ట్యూషన్‌కు వెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో ట్యూషన్ నుంచి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన సాయికిరణ్, ఇబ్రహీంపట్నానికి చెందిన మరో ముగ్గురు యువకులతో కలిసి మద్యం మత్తులో విద్యార్థులపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకోగా వారిపై కూడా యువకులు దాడి చేశారు.

సంక్షిప్తంగా...

ఏరియా ఆస్పత్రిలో పింఛన్ల రీ వెరిఫికేషన్



నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 23 నుంచి వైద్యులు పింఛన్ల పునఃపరిశీలన ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ముందుగా ఆగిరిపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులను నూజివీడు ఏరియా ఆస్పత్రికి పిలిపించి పరీక్షిస్తున్నారు. రోజుకు 60 మందికి చొప్పున నేత్ర వైద్యులు పరీక్షలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్ల ద్వారానే తమకు పింఛన్ మంజూరైందని, ఇప్పుడు మళ్లీ పరీక్షలు నిర్వహించడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలి

నూజివీడు: ప్రతి గృహ వినియోగదారుడు సోలార్ విద్యుత్ వ్యవస్థను పెట్టించుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఏడీఈ ఓలేటి దుర్గారావు అన్నారు. పోతురెడ్డిపల్లిలో సీపీఐ నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు తన గృహానికి పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో ఏర్పాటు చేసుకున్న సోలార్ విద్యుత్ సదుపాయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సర్పంచి తగరం సుజాత, సీపీఐ రాష్ట్ర నాయకుడు చలసాని వెంకటరామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

నూజివీడు: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో బాలికలకు, బాలురకు కబడ్డీ, వంద మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌లో పోటీలు జరిగాయి. విజేతలకు రిపబ్లిక్ డే రోజున బహుమతులు అందజేస్తామని హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి తెలిపారు.

బూరుగుగూడెంలో పశు వైద్య శిబిరం

చాట్రాయి: పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని చాట్రాయి పశు వైద్యాధికారి శివ నాగేంద్రబాబు పేర్కొన్నారు. బూరుగుగూడెం గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 320 గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్, 500 గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్, 134 గేదెలకు చూడి పరీక్షలు చేశామని చెప్పారు. అనంతరం పశు పోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించండి

ఇబ్రహీంపట్నం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య కోరారు. ఇబ్రహీంపట్నం సీపీఎం కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, మాజీ రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, జిల్లా, మండల నాయకులు రెడ్‌స్టార్, ఆర్మ్‌స్ట్రాంగ్, అమర్‌నాయక్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలన అందరి బాధ్యత

ముసునూరు: చింతలవల్లి శివారు గోగులంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం బాలికలకు బాల్య వివాహాల నిరోధం, బాలికా విద్య ప్రాధాన్యం, సమాజంలో బాలికల పట్ల జరుగుతున్న అకృత్యాలు, అన్యాయాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సురేష్, సచివాలయ మహిళా సంరక్షకురాలు ఎం.భూలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నూజివీడు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా పలు పాఠశాలల విద్యార్థినులు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ముగ్గులు వేశారు. వాటిని సబ్ కలెక్టర్ స్వయంగా పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ముగ్గులను ఎంపిక చేశారు.

కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



నూజివీడు: కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, పీఎఫ్ బకాయిలను సంబంధిత కాంట్రాక్టర్ విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని ఏరియా ఆస్పత్రి గేటు వద్ద శుక్రవారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా జీతాలు చెల్లించడం లేదని చెప్పారు. వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.